క్లుప్తంగా

ఆత్మీయ కలయిక


జగన్‌ను కలిసిన దెందులూరు నాయకులు

దెందులూరు: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో పార్టీ దెందులూరు మండలం అధ్యక్షుడు కామిరెడ్డి నాని, మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర కుమార్ కలిశారు. మండలంలో నెలకొన్న పరిస్థితులు, పార్టీ శ్రేణులు పడుతున్న ఇబ్బందులను అధినేత దృష్టికి తీసుకెళ్లారు. కొంత కాలం ఓపిక పట్టాలని అధినేత జగన్ సూచించారని నాయకులు తెలిపారు.

వ్యాయామ విద్యార్థుల ప్రతిభ


విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సత్తానియేలు

దెందులూరు: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మహిళల బాస్కెట్‌బాల్ పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. ఏలూరు సెయింట్ ఆన్స్ కళాశాలలో గురువారం జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ ఎస్ సత్తానియేలు అన్నారు. శుక్రవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో విజేతలను ప్రిన్సిపాల్, లెక్చరర్లు దిలీప్ కుమార్, రతన్ బాబు, సిబ్బంది అభినందించారు.

అక్కిరెడ్డిగూడెంలో ఆర్‌సీఎం చర్చి ప్రారంభం


ప్రత్యేక పూజ చేస్తున్న బిషప్ జయరావు

దెందులూరు: అక్కిరెడ్డిగూడెం గ్రామంలో నిర్మించిన ఆర్‌సీఎం చర్చిని శుక్రవారం ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు ప్రారంభించారు. నాగులదేవునిపాడు విచారణ కర్త ఫాదర్ ఇంటి జేవియర్, సంఘస్తులు ఆధ్వర్యంలో చర్చిని ప్రారంభించారు. ఈ సందర్భంగా జయరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవునికి ఇష్టమైన రీతిలో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీ కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, ఫాదర్లు బాబు జార్జ్, మోజెస్, ఇతర దేశ ప్రతినిధులు, ఫాదర్లు, గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, వార్డు మెంబర్లు రాజీవ్, శ్రీధర్ ఉన్నారు.

ఘనంగా లక్ష్మీనారాయణ కల్యాణం


రావి, వేపచెట్లకు కల్యాణం చేస్తున్న భక్తులు

నిడమర్రు: మండలపర్రు పంచాయితన క్షేత్రంలో శుక్రవారం లక్ష్మీనారాయణ కల్యాణం వైభంగా నిర్వహించారు. వేపచెట్టు లక్ష్మీదేవి, రావిచెట్టు నారాయణ స్వామిగా భావించి రుద్రరాజు మార్కండేయరాజు దంపతులు కళ్యాణం నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన అన్నసమారాధనలో రెండు వేల మంది భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కలెక్టర్‌కు పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమ ఆహ్వానం



కలెక్టర్ వెట్రిసెల్వికి ఆహ్వాన పత్రం అందిస్తున్న విద్యార్థిని

ఏలూరు(మెట్రో): వట్లూరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలలో శనివారం ఉదయం నుంచి నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమానికి కలెక్టర్ కె.వెట్రిసెల్విని సంబంధిత పాఠశాల విద్యార్థినులు, సిబ్బంది ఆహ్వానించారు. ఏలూరు కలెక్టరేట్లో శుక్రవారం కలెక్టర్‌ని కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.మేరీ ఝాన్సీ రాణి, ఎంఈఓ డీవీ రమణ, ఉపాధ్యాయురాలు, బి.చైతన్య, విద్యార్థిని బి.సంధ్య ఉన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు


క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు


కైకరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


గుండుగొలనులో నివాళులర్పిస్తున్న ఉపసర్పంచ్ సూర్యనారాయణరాజు


భీమడోలులో నివాళులర్పిస్తున్న మాన్‌సింగ్, రామకుర్తి నాగేశ్వరరావు

గణపవరం: బడుగుల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని, సమాజంలో అసమానతలు రూపుమాపడానికి సంసిద్ధులు కావాలని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన అంబేద్కర్‌కు ఆయా వర్గాలు చరిత్ర ఉన్నంతకాలం రుణపడి ఉంటాయని వివరించారు. అంబేడ్కర్ కలలు గన్న సమసమాజ స్థాపనకు మనమంతా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జి.విశ్వనాధరాజు, బేతు రాజశేఖర్, నడింపల్లి రాము, కట్రెడ్డి సుధాకర్, మారిశెట్టి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

● గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేడు సమాజంలో అన్నివర్గాలూ సమాన అవకాశాలు పొందడం అంబేద్కర్ రాజ్యాంగమే కారణమన్నారు. అంబేద్కర్ ఆశయసాధనకు విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు చైతన్య, వెంకట్రావు, వెంకటరమణ, శ్రీదీప, భాస్కరరావు, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి అంబేద్కర్

ఉంగుటూరు: పేదల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ నేత పుప్పాల గోపి అన్నారు. శుక్రవారం కైకరంలో అంబేద్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కొరిపల్లి శ్రీను, గంజి ప్రభాకరరావు, అనిల్, పాల్గొన్నారు.

అతిపెద్ద ప్రజాస్వామ్యం అంబేద్కర్ ఘనతే

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మన దేశం ఎదగడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కృషే కారణమని నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ వర్ధంతి సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు సంక్షేమానికి అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగమే కారణమన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు దరిశివ రెడ్డియ్య, మణీంద్రరావు, బాబూరావు, వెంకటేశ్వరరెడ్డి, నిర్మల జ్యోతి పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపనకు కృషి

భీమడోలు: సమ సమాజ స్థాపనకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి బీఆర్ అంబేద్కర్ అని వక్తలు కొనియాడారు. భీమడోలు, గుండగొలను గ్రామాల్లో శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. గుండుగొలనులో ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, భీమడోలు, అర్జావారిగూడెంలలో వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు, చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్‌సింగ్‌లు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా ప్రాంతాలు జై భీమ్ నినాదాలతో మార్మోగాయి. గుండుగొలను ఉపసర్పంచ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము మాన్‌సింగ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటు పడిన మహోన్నత వ్యక్తి అంబేద్కరని, ఆయన సేవలు మరువలేనివని అన్నారు. వార్డు సభ్యులు గొటికల మురళీ, కె.కిరణ్‌లు మాట్లాడారు. కార్యక్రమాల్లో ఏలూరు వక్ఫ్‌బోర్డ్ సభ్యుడు షేక్ మహ్మద్ జహీర్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, పెద్దలు టి.సుమన్‌బాబు, బోడ సంసోన్, లింగాల శ్రీను, కాలి టింకు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా పేరెంట్స్ సమావేశం


పాఠశాల అలంకరణను పరిశీలిస్తున్న అధికారులు

భీమడోలు: మండల వ్యాప్తంగా శనివారం నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. పూళ్ల ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాల, భీమడోలులోని ప్రాథమిక పాఠశాల నెం-1లను శుక్రవారం ఎంఈఓ ఈదుపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆమె సందర్శించారు. మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం ఏర్పాట్లను పరిశీలించారు. పూళ్ల ఉన్నత పాఠశాలలో తరగతి గదుల అలంకరణ, వివిధ కమిటీల ఏర్పాటు, ఆటల నిర్వహణ తదితర అంశాలపై హెచ్ఎం పెనుగొండ భువనేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం, టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్


కేక్ కట్ చేస్తున్న ఫాదర్లు

దెందులూరు: స్థానిక మన్నా చర్చిలో శుక్రవారం చర్చి పాస్టర్ బెంజిమెన్ దంపతులు, పాస్టర్ జాన్ వెస్లీ రత్నం కుమారి, పాస్టర్ రాకేష్ పాస్టర్, సంఘస్తులు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేకును కట్ చేశారు. దెందులూరుతో పాటు సమీప గ్రామాల నుంచి విశ్వాసులు హాజరయ్యారు.

ఐక్యతతోనే హిందూ ఆలయాల రక్షణ


మాట్లాడుతున్న శ్యామప్రసాద్ ముఖర్జీ

ఉంగుటూరు: ఐక్య పోరాటంతోనే హిందూ ఆలయాలను రక్షించుకోగలుగుతామని విశ్వహిందూ పరిషత్ జాతీయ లీగల్ సెల్ కోరు కమిటీ సభ్యులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం గోపీనాథపట్నం గ్రామంలో కొట్టు సరస్వతి వెంటేశ్వరరావు కళ్యాణ మండలపంలో హైందవ శవంఖారావం మండల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖర్జీ మాట్లాడుతూ ఆలయాలకు స్వతంత్రత కల్పించాలన్నారు. విజయవాడలో జనవరి 5 న జరిగే హిందువులు శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరారు. పేలవరం ఆశ్రమం సత్యానంద గిరి స్వామీజి మాట్లాడుతూ హిందు అనేది మతం కాదని అది ధర్మం అని తెలిపారు. వేదాలు, హితిహసాల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, హిందువులు అందరు భగవద్గీతను చదివి అర్ధంచేసుకోవాలని సూచించారు. శంఖారావం సభకు హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఉంగుటూరు ఖండ కర్యవహ్ చిలకంటి జయరాజు, భారతీయ కిసాన్ సంఘ జిల్లా ఉపాధ్యక్షులు కడియాల ప్రేమసాయి, సంక్షేమం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగపతి, ముల్లపూడి భూపతిరావు, జిల్లా రమేష్, నూకల రోహిత్ నాయుడు మెట్టసత్యనారాయణ పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చాలి


పోలసానిపల్లి నెం-3 పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

భీమడోలు: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ఎంఈఓ ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. పోలసానిపల్లి నెం-1, -2 ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మిక సందర్శన చేశారు. నెం-1 పాఠశాలలోని విద్యార్థులను సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈనెల 7న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు ప్రాథమిక పాఠశాలను ఎస్ఎస్ఏ ఎంఐఎస్ కోఆర్డినేటర్ వి.రమేష్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు కె.తులసి. నిర్మలకుమారి, శ్యామల, టీచర్ మండే సుధాకర్, నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పూజలు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో మాజీ మంత్రి కారుమూరి, మాజీ ఎమ్మెల్యే వాసుబాబు

అత్తిలి: వల్లీదేవసేన సమేతశ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని రాష్ట్ర మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. ఈసందర్భంగా శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులు తిలకించారు. అనంతరం వీరికి ఆలయ కమిటీ సభ్యులు శ్రీస్వామివారి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కురెళ్ల ఉమామహేశ్వరరావు, కల్యాణ మండప కమిటీ అధ్యక్షులు కూనపరెడ్డి జయరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు


బెల్టుషాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

కొయ్యలగూడెం: పోలవరం ఎక్సైజ్ సిబ్బంది శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. సీఐ ఆర్.సత్యవతి ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఎర్రంపేటలో కారంకి రామకృష్ణ అనే వ్యక్తి బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించి అతనిపై కేసు నమోదు చేసి, ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సై ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సారా అమ్ముతున్న ఇద్దరి అరెస్టు

టి.నరసాపురం: సారాతో ఉన్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఫణికుమార్ తెలిపారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత ఆదేశాల మేరకు శుక్రవారం వల్లంపట్లలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు సుధాకర్ పాల్గొన్నారు.

కలప స్వాధీనం

కొయ్యలగూడెం: కన్నాపురం అటవీశాఖ అధికారులు అక్రమంగా తరలిస్తున్న కలపను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పోలవరం మండలం ఎల్ఎన్‌డీ పేట గ్రామ సమీపంలో వాహనంలో తరలిస్తున్న ఇరవై ఒక్క బండారు కలప దిమ్మలను స్వాధీనం చేసుకున్నట్లు సెక్షన్ అధికారి కరీమ్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని కలప, వాహనాన్ని సీజ్ చేసి కన్నాపురం అటవీ శాఖ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. కన్నాపురం సెక్షన్ అధికారి బి.దినేష్, స్పెషల్ డ్యూటీ సెక్షన్ అధికారి పోసారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక వారోత్సవాలు


మెహందీ అలంకరణలో విద్యార్థినులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో సాంస్కృతిక వారోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థినులకు మెహందీ, కేశ అలంకరణ, పద్య పఠనం, పాటల పోటీలు నిర్వహించారు. మెహందీ పోటీల్లో ఆర్ సౌమ్యశ్రీ ప్రథమ, ఎస్ కే సుల్తానా ద్వితీయ, ఎన్ మీనాక్షి తృతీయ, పి.శైనిక ప్రోత్సాహక, కేశాలంకరణ పోటీల్లో ఎన్ సింధూర, టి.మీనాక్షిత, ఎ.దుర్గ వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలువగా కె.నాగ శిరీష ప్రోత్సాహక బహుమతులు సాధించారు. పద్య పఠనం పోటీల్లో సీహెచ్ శ్రావణి ప్రథమ, ఎస్ అనూష ద్వితీ, ఎన్ మానస తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి, విజేతలుగా నిలిచిన వారికి కరస్పాండెంట్ విశ్వనాధరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సరళ శుభాకాంక్షలు తెలిపారు.

మగ ఆరోగ్య కార్యకర్తలకు న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): వైద్య ఆరోగ్య శాఖ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నియమించిన మగ ఆరోగ్య కార్యకర్తలను తొలగించాలనే నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షుడు డీఎన్‌వీడీ ప్రసాద్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీవీ రమణ, సయ్యద్ జఫ్రుల్లా, డి.వేణుగోపాల్, ఎం బాలరాజులు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 15 మంది 20 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్నారని, కరోనా సమయంలో ప్రాణాలకు సైతం తెగించి పనిచేశారని వివరించారు. ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మగ ఆరోగ్య కార్యకర్తలను తొలగించాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు.

లీడర్‌షిప్ శిక్షణ జిల్లా కేంద్రంలోనే ఇవ్వాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన చర్చలో ఒప్పుకున్న విధంగా లీడర్‌షిప్ శిక్షణను జిల్లా కేంద్రాల్లోనే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించే లీడర్‌షిప్ శిక్షణలో పాల్గొన్న ఇద్దరు ప్రధానోపాధ్యాయులు శిక్షణ కేంద్రాల్లోనే మరణించారని, దీంతో ఈ లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమాన్ని నాన్ రెసిడెన్షియల్ విధానంలో జిల్లా కేంద్రాలలో నిర్వహించాలని పలుమార్లు విన్నవించామని తెలిపారు. అయినప్పటికీ ఈ నెల 9వ తేదీ నుంచి మొదలయ్యే నాలుగో విడత శిక్షణ జిల్లా కేంద్రాల్లో కాకుండా తిరిగి అదే మారుమూల ప్రాంతంలో నిర్వహించడం సరికాదని పేర్కొన్నారు. శిక్షణ కేంద్రం సుదూర ప్రాంతంలో ఉండడం వల్ల రోజూ వెళ్లి రావడానికి అనుకూలం కాదని, దీనిపై అధికారులు పునరాలోచించి జిల్లా కేంద్రంలోనే శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సక్కు కుమారికి సత్కారం

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ముమ్మడి చింతయ్య సతీమణి సక్కు కుమారి సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు (డీఆర్‌యూసీసీ, విజయవాడ డివిజన్) సభ్యురాలిగా నియమితులైన సందర్భంగా సంఘ నాయకులు ఆమెను, చింతయ్యను శుక్రవారం సత్కరించారు. వట్లూరులోని వారి నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘ నేతలు సీహెచ్ శ్రీనివాసరావు, ఉక్కు సూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన లింగరాజు

భీమడోలు: ఏలూరు జిల్లా బుట్టాయిగూడెంలో ఈనెల 13 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే సీపీఎం జిల్లా 26వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు కోరారు. భీమడోలులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల పార్టీ సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశానికి నాయకుడు కె.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ లింగరాజు మాట్లాడుతూ ఈ మహాసభల్లో ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాబోయే మూడేళ్లకు నూతన కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు. సభలకు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నాయకులు ఉమామహేశ్వరరావు, మంతెన సీతారామ్ తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు కట్టా భాస్కరరావు, పొలుకొండ నాగరాజు, మానుకొండ వీర్రాజు, తానంకి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

చక్కటి దిగుబడులతో ఆరోగ్యవంతమైన సమాజం


కార్యక్రమంలో మాట్లాడుతున్న కొప్పాక సర్పంచ్ భాస్కర దీక్షితులు

పెదవేగి : వ్యవసాయంలో శాస్త్రీయ అధునాతన పరిజ్ఞానాన్ని ఉపయోగించి చక్కటి దిగుబడులను సాధించి తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని కొప్పాక సర్పంచ్ పరాశరం భాస్కర దీక్షితులు అన్నారు. స్థానిక కొప్పాక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం రైతు సదస్సు నిర్వహించారు. ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం అనుబంధ సంస్థ మార్కాపురం ఎస్ఎస్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వ్యవసాయంలో ఉన్న అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థుల అనుభవాన్ని అందరితో పంచుకోవాలని సూచించారు. ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం లాభసాటి చేసుకోవాలని రైతులకు ఏరువాక కేంద్రం సమన్వయకర్త ఫణికుమార్ సూచించారు. సోలార్ ఫెన్సింగ్, మిల్టీ లేయర్ క్రాపింగ్, పాలీ హౌస్, గ్రీన్ హౌస్, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్ నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.ఫణికుమార్, విస్తారణ శాస్త్రవేత్త ఎస్ నాగేంద్రబాబు, ఎస్ఎస్ వ్యవసాయ కళాశాల ఏడీఆర్ రవి తేజ పాల్గొన్నారు.

అభయ యాప్‌తో నేరగాళ్ల అదుపు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై నాగ కళ్యాణి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నేటి సమాజంలో విచక్షణ లేకుండా నేరాలు చేస్తోన్న నేరగాళ్లను అదుపులోకి తీసుకురావాలన్న ముఖ్య ఉద్దేశంతో అభయ మహిళా భద్రత యాప్‌ను ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ప్రవేశపెట్టారని ఏలూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై నాగ కళ్యాణి అన్నారు. డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు ఏలూరు 2 టౌన్ ఇన్‌స్పెక్టర్ వైవీ రమణ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్‌పీడీబీటీ కళాశాలలో విద్యార్థినులకు అభయ.. మహిళల భద్రత అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్సై నాగ కళ్యాణి మాట్లాడుతూ ఎవరైనా ఆపద సమయంలో వెంటనే డయల్ 112కు ఫోనులో సమాచారం అందించిన పది నిమిషాల్లో పోలీసులు భద్రత కల్పిస్తారని తెలిపారు. బాల్యవివాహాలపై 1098కు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి సమాచారం ఇస్తే సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ఎస్పీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సాప్ నెంబర్ 9550351100కు సమాచారం అందించాలన్నారు. సమాజంలో జరిగే అన్యాయాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం పోలీసులకు అందజేయాలని కోరారు.